క్లుప్తంగా

రావిఆకుపై మహిళా శక్తి



పొదలకూరు: మండలంలోని మహ్మదాపురం గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు పచ్చా పెంచలయ్య రావిఆకుపై మహిళా శక్తి చిత్రాన్ని వేశారు.

ఇష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలు



ఇందుకూరుపేట: విద్యార్థులు ఇష్టపడి చదివితే పదో తరగతిలో మంచి మార్కులను సాధించొచ్చని ఉర్దూ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఖాజామొహిద్దీన్ పేర్కొన్నారు. మండలంలోని కొమరిక ఉర్దూ, జెడ్పీ, లేబూరులోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలను ఆకస్మికంగా శుక్రవారం తనిఖీ చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. ఉర్దూ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందని, పెంచాలని సూచించారు. ప్రధానోపాధ్యాయుడు దశరథరామిరెడ్డి, ఖాజారహంతుల్లా, యస్దానీ తదితరులు పాల్గొన్నారు.

సర్వేను త్వరగా పూర్తి చేయండి

తోటపల్లిగూడూరు: గ్రామీణ ప్రాంతాల్లో జరుగుతున్న అసంక్రమణ వ్యాధుల సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని నెల్లూరు రూరల్ డివిజన్ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ దయాకర్ సూచించారు. మండలంలోని కోడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఓపీ గురించి ఆరాతీశారు. వైద్యశాలలోని రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా దయాకర్ మాట్లాడుతూ సర్వేను వేగవంతంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. మాతాశిశు సంరక్షణ చర్యలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నట్లు వెల్లడించారు. ఆయా కార్యక్రమాల నిర్వహణపై అధికారులు, వైద్యశాఖ సిబ్బంది అలసత్వం ప్రదర్శించొద్దన్నారు. వైద్యశాలలో మెరుగైన వసతులు కల్పించి ఓపీ పెంచాలన్నారు. కార్యక్రమంలో కోడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ నరేంద్ర, సీహెచ్ఓ రమేష్, హెల్త్ ఎడ్యుకేటర్ ఉమర్, స్టాఫ్ నర్సులు సువర్ణ దీపిక, ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ అమలుకు డిమాండ్

- నేటి నుంచి ప్రజాచైతన్య యాత్ర



మాట్లాడుతున్న జిల్లా కమిటీ సభ్యుడు అంకయ్య

ముత్తుకూరు: సూపర్ సిక్స్ అమలు చేస్తామని ఎన్నికల సమయంలో ప్రచారం చేసిన కూటమి పెద్దలు అధికారంలోకి వచ్చాక వాటి ఊసే ఎత్తడం లేదని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు గడ్డం అంకయ్య విమర్శించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. ఇచ్చిన హామీలు నెరవేర్చాలన్న డిమాండ్‌తో శనివారం నుంచి 17వ తేదీ వరకు మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రజాచైతన్య యాత్ర నిర్వహిస్తున్నామన్నారు. మండలంలో అనేక సమస్యలు ఉన్నాయన్నారు. వాటిని పరిష్కరించాలన్నారు. సమావేశంలో నక్కా రాధయ్య, షేక్ మస్తాన్, చేవూరు మల్లికార్జున పాల్గొన్నారు.

ఎన్‌సీసీపై ఆసక్తి అభినందనీయం



కొడవలూరు: కళాశాలలో ఎన్‌సీసీని ఏర్పాటు చేసిన మొదటి సంవత్సరంలోనే విద్యార్థులు అధికంగా చేరడాన్ని 10ఏ నావల్ యూనిట్ ఎన్‌సీసీ కమాండ్ ఆఫీసర్ గణేష్ అభినందించారు. నార్తురాజుపాళెంలోని వెంకటేశ్వర కళాశాలలో ఎన్‌సీసీ క్యాడెట్లకు నిర్వహిస్తున్న శిక్షణను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఆయనకు కళాశాల చైర్మన్ డాక్టర్ గుణశేఖర్ పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. ఎన్‌సీసీ సూపరింటెండెంట్ సాగర్ ముకుంద, ప్రిన్సిపల్ ప్రకాష్‌రావు, ఏఓ గిరీష్, కేర్ టేకర్ సతీష్, పీడీలు ఫణికుమార్, బాలరాజు పాల్గొన్నారు.

నాడు అభివృద్ధి వెలుగులు.. నేడు మాటలే..

- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై కూటమి దుష్ప్రచారం
- కళ్లముందే ఎన్నో పనులు
- ప్రస్తుతం నిధుల్లేవు
- సమీక్షలతో నాయకుల కాలక్షేపం

ముత్తుకూరు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గ్రామాల్లో పెద్దఎత్తున అభివృద్ధి పనులు జరిగాయి. ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందాయి. అయితే అప్పట్లో అభివృద్ధి జరగలేదని కూటమి నేతలు దుష్ప్రచారం చేశారు. అధికారంలోకి వచ్చాక కూడా దానిని కొనసాగిస్తున్నారు. వారి తొమ్మిది నెలల పాలనలో చేసిందేమీ లేదు. కానీ నాయకుల నుంచి కార్యకర్తల వరకు గతంలో రాష్ట్ర సర్వనాశనమైందని, నాడు అభివృద్ధి జరగలేదని చెబుతూనే ఉన్నారు. ప్రతిచోటా ఇదే తప్పుడు ప్రచారం చేస్తూ నిజమని నమ్మించే ప్రయత్నం చేస్తున్నారు. కానీ వాస్తవాలు మరోలా ఉన్నాయి.

మండలంలో ఇలా..

నాటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ముత్తుకూరు మండలంలో 'బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్'ను మంజూరు చేసింది. దీనికి రూ.40 లక్షలు కేటాయించింది. పూర్తైన ఈ భవనాన్ని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ప్రారంభించారు. అలాగే వల్లూరులో వెటర్నరీ ఆస్పత్రి నూతన భవనానికి గత ప్రభుత్వం రూ.10 లక్షలు మంజూరు చేసింది. దీనిని కూడా ఎమ్మెల్యేనే ప్రారంభించారు. మరోవైపు ముత్తుకూరులో జల్‌జీవన్ మిషన్ ప్రాజెక్ట్‌ను అప్పటి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వమే మంజూరు చేసింది. దీనికి రూ.72 లక్షలిచ్చింది. ఇదీ ప్రారంభానికి సిద్ధంగా తయారైంది. ఇక గ్రామాల్లో సచివాలయాలు, ఆర్‌బీకేలు, హెల్త్ క్లినిక్ భవనాలు, నాడు – నేడు స్కూళ్లు, సీసీ రోడ్లు ప్రత్యక్షంగా కనిపిస్తున్నాయి. రక్షిత మంచినీటి పథకాలు దర్శనమిస్తున్నాయి. గత ఐదేళ్లలో ఒక్క పంటపాళెం పంచాయతీలో నాలుగు భారీ పామాయిల్ ఫ్యాక్టరీలు నిర్మాణం కావడం విశేషం. అడుగడుగునా జరిగిన అభివృద్ధికి కనిపిస్తున్నా.. కూటమి నేతలు ఇష్టానుసారంగా అబద్ధాలు ప్రచారం చేస్తుండటంపై ప్రజలు మండిపడుతున్నారు. కాగా ప్రస్తుతం అభివృద్ధి పనుల ఊసే లేదు. కూటమి నేతలు అది చేస్తాం.. ఇది చేస్తామంటూ మాటలకే పరిమితమయ్యారు.



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మంజూరై ఇటీవల ప్రారంభించిన పీహెచ్‌సీ అదనపు భవనం



గత ప్రభుత్వం మంజూరు చేయగా ఇటీవల ప్రారంభించిన వల్లూరు వెటర్నరీ ఆస్పత్రి



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న జల్‌జీవన్ మిషన్ ప్రాజెక్ట్

విష ప్రచారం సాగిస్తున్నారు



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతి గ్రామంలో అభివృద్ధి పనులు జరిగాయి. మౌలిక సదుపాయాలు కల్పనకు నేతలు కృషి చేశారు. అయితే కూటమి పాలకులు మాత్రం అభివృద్ధి జరగలేదంటూ విష ప్రచారం చేస్తున్నారు. కళ్ల ముందున్న నిజాలకు మసి పూస్తున్నారు.

– దువ్వూరు హారికారెడ్డి, సర్పంచ్, పీఆర్ గుంట

అభివృద్ధికి నిదర్శనం పంటపాళెం



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో అభివృద్ధి జరగలేదని దుష్ప్రచారం చేస్తున్నారు. అయితే ఒక్క పంటపాళెం పరిసరాల్లోనే నాలుగు పామాయిల్ ఫ్యాక్టరీలు ఏర్పడ్డాయి. భూముల విలువ పెరిగింది. నాటి వైఎస్సార్ పాలనతో సమానంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అభివృద్ధి జరిగిందనడానికి పంటపాళెమే నిదర్శనం.

– నంగా చెంగారెడ్డి, ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు, ముత్తుకూరు మండలం

వీడిన హత్య కేసు మిస్టరీ

పొదలకూరు: మతిస్థిమితం లేని వ్యక్తిని పాశవికంగా హత్య చేసిన హంతకుడిని సీసీ కెమెరాలు పట్టించాయి. మద్యం మత్తులో ఉన్న నిందితుడు లైంగిక వాంఛ తీర్చుకునేందుకే భిక్షాటన చేస్తున్న వ్యక్తిని వెంబడించి శ్మశానంలోకి తీసుకెళ్లి హత్య చేసినట్టు పోలీసుల దర్యాప్తులో తేలింది. వారి కథనం మేరకు.. పట్టణంలోని శ్మశానవాటికలో ఈనెల ఒకటో తేదీ రాత్రి మతిస్థిమితం లేని వ్యక్తి హత్యకు గురైన విషయం తెలిసిందే. నెల్లూరు రూరల్ డీఎస్పీ జి.శ్రీనివాసరావు గురువారం రాత్రి సీఐ కార్యాలయంలో వివరాలను వెల్లడించారు. ప్రకాశం జిల్లా పొన్నలూరు మండలానికి చెందిన గురునాథం రమేష్ అనే పాతనేరస్తుడు శివరాత్రి సందర్భంగా పొదలకూరులోని బంధువుల ఇంటికి వచ్చాడు. అతను వీధుల్లో సంచరిస్తున్న మతిస్థిమితం లేని వ్యక్తిని శివాలయం వీధి పక్కనున్న శ్మశానానికి తీసుకెళ్లినట్టు సీసీ కెమెరాల్లో రికార్డైంది. రమేష్ ముందుగా మతిస్థిమితం లేని వ్యక్తి తలపై దాడికి పాల్పడ్డాడు. అపస్మారక స్థితిలో ఉన్న వ్యక్తిపై లైంగిక దాడి చేసి కట్టెలతో కొట్టి హతమార్చాడు. మరసటి రోజున పోలీసులు మృతదేహాన్ని గుర్తించి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించి నిందితుడిని పట్టుకున్నారు. కేసును ఛేదించిన సీఐ ఎ.శివరామకృష్ణారెడ్డి, ఎస్సై ఎస్‌కే హనీఫ్‌ను డీఎస్పీ అభినందించారు.

నేటి నుంచి భాగవత సప్తాహం

పొదలకూరు: పట్టణంలోని శ్రీలక్ష్మి గోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం నుంచి 15వ తేదీ వరకు శ్రీమద్ భాగవత ప్రవచనం జరుగుతుందని ఆలయ కమిటీ చైర్మన్ పెంద్యాల రమణయ్యనాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రోజూ సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు సప్తాహం జరుగుతుందని తెలియజేశారు.

యథేచ్ఛగా గ్రావెల్ తవ్వకాలు



రాత్రి సమయంలో జేసీబీతో గ్రావెల్ తవ్వకాలు



పగలు ట్రాక్టర్‌లో తరలుతున్న గ్రావెల్

- లేఅవుట్లకు తరలింపు
- పట్టించుకోని అధికారులు

పొదలకూరు: పట్టణానికి సమీపంలో చిట్టేపల్లి తిప్ప నుంచి గ్రావెల్‌ను అక్రమంగా తరలిస్తున్నారు. కొందరు అధికార పార్టీ నాయకులు లేఅవుట్ల యజమానులతో మాట్లాడుకుని గ్రావెల్‌ను తరలించి సొమ్ము చేసుకుంటున్నా రెవెన్యూ, పోలీసు అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. ఇప్పటికే చిట్టేపల్లి కొండ గ్రావెల్ తరలింపుతో కరిగిపోయింది. ఉన్న కొండను సైతం కొంత కాలంగా నామరూపాలు లేకుండా చేస్తున్నారని ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందుతున్నాయి. ట్రాక్టర్‌కు రూ.1,000, టిప్పర్‌కు రూ.5 వేలు వంతున అవసరమైన లేఅవుట్లకు గ్రావెల్‌ను తోలుతున్నట్టు తెలుస్తోంది. రెవెన్యూ కార్యాలయం మీదుగానే ట్రాక్టర్లు వెళుతున్నా పట్టించుకునే నాథుడే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఘనంగా మహిళా దినోత్సవం



వెంకటాచలం: డీఎంహెచ్‌ఓకు సత్కారం



వెంకటాచలం: తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రంలో..

వెంకటాచలం: మండలంలోని కాకుటూరు వద్ద నున్న విక్రమ సింహపురి యూనివర్సిటీలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ వి.సుజాత మాట్లాడుతూ మహిళలు వివిధ రంగాల్లో రాణించాలంటే ఆత్మవిశ్వాసం, విద్య, ఆర్థిక స్వావలంబన ముఖ్యమని తెలియజేశారు. వర్సిటీ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత మాట్లాడుతూ విద్యార్థినులు లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించాలన్నారు. డీఎంహెచ్‌ఓ, అధ్యాపకురాలను సన్మానించారు.

➡ సరస్వతీనగర్ వద్దనున్న ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. విధులు నిర్వహిస్తున్న మహిళా ఉద్యోగులను డైరెక్టర్ సంపత్ కుమార్ సత్కరించి వారి సేవలను కొనియాడారు. అలాగే దివ్యాంగుల ప్రాంతీయ సంయుక్త కేంద్రం (సీఆర్‌సీ)లో కూడా వేడుకలు జరిగాయి. సీనియర్ సివిల్ జడ్జి, న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి కె.వాణి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. దివ్యాంగ మహిళలకు నిర్వహించిన ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.



మనుబోలు: మ్యూజికల్ చైర్స్ ఆడేందుకు విచ్చేసిన అంగన్‌వాడీలు

➡ మనుబోలు: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం మనుబోలు జెడ్పీ ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీలకు ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమణమ్మ వివిధ అంశాలపై అవగాహన కల్పించారు.

వైఎస్సార్సీపీ ఆధ్వర్యంలో 10న నిరసన



మాట్లాడుతున్న చలపతిరావు

కొడవలూరు: రైతులకు మద్దతు ధర కోసం విడవలూరులో అన్నదాతలకు అండగా వైఎస్సార్సీపీ జెండా పేరుతో పార్టీ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీని సోమవారం నిర్వహించనున్నామని పార్టీ జిల్లా అధికార ప్రతినిధి వీరి చలపతిరావు పేర్కొన్నారు. నార్తురాజుపాళెంలోని వీసీఆర్ అతిథిగృహంలో విలేకరుల సమావేశంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీగా తరలివచ్చే రైతులతో నిరసన ర్యాలీని నిర్వహించనున్నామని వివరించారు. రైతుల శ్రేయస్సు కోరే ప్రజాసంఘాలు హాజరుకావాలని కోరారు. రైతుల కోసం వైఎస్సార్, జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం తపించేవారని చెప్పారు. రైతులపై కూటమి ప్రభుత్వం కర్కశంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. రైతులకు ఇచ్చిన హామీల్లో దేన్నీ అమలు చేయకపోగా మద్దతు ధరను కల్పించకపోవడం దారుణమన్నారు. డీఎల్డీఏ మాజీ చైర్మన్ గొల్లపల్లి విజయకుమార్, ఎంపీపీ జ్యోతి, సర్పంచ్ సుప్రియ, ఎంపీటీసీ అనిల్‌కుమార్‌రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు చిమటా శేషగిరిరావు, అత్తిపల్లి అనూప్‌రెడ్డి, కాటంరెడ్డి నవీన్‌రెడ్డి, మావులూరు శ్రీనివాసులురెడ్డి, సతీష్‌రెడ్డి, కొండా శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి



ఇందుకూరుపేట: రైతులతో అధికారుల సమావేశం

ఇందుకూరుపేట: ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ కృష్ణప్రసాద్ కోరారు. కొనుగోలు కేంద్రాలపై మండలంలోని ఇందుకూరుపేట కో ఆపరేటివ్ బ్యాంక్‌లో ఏడీ రాజ్‌కుమార్, ఏఓ రఘునాథ్‌రెడ్డితో కలిసి రైతులకు అవగాహనను శుక్రవారం కల్పించారు. రైతులు పాటించాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు.

➡ బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని పంచేడు, మినగల్లు, పెనుబల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ అంబటి వెంకటేశ్వర్లు సందర్శించారు. అనంతరం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ధాన్యం కొనుగోలు విషయంలో ఎలాంటి ఇబ్బందులున్నా, తన దృష్టికి తీసుకురావాలని కోరారు.

➡ కొడవలూరు: ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ స్ఫూర్తి, ఎంపీడీఓ సుబ్బారావు, ఏడీఏ సుజాత కోరారు. మండలంలోని కొడవలూరు, యల్లాయపాళెం, గండవరంలోని కొనుగోలు కేంద్రాల్లో నిర్వహించిన అవగాహన కార్యక్రమాల్లో వారు మాట్లాడారు. మండలంలో 14 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారని వివరించారు. ఏ గ్రేడ్ ధాన్యం పుట్టికి రూ.19,720 మేర మద్దతు ధరను అందజేయనున్నామని పేర్కొన్నారు. జియో టాగింగ్ ఉన్న వాహనాల్లోనే ధాన్యాన్ని తరలించాలని, ఏమైనా సమస్యలు ఎదురైతే ఆన్‌లైన్లో వెంటనే పరిష్కరించేందుకు వెసులుబాటు ఉంటుందని చెప్పారు. కాగా యల్లాయపాళెంలోని రైతులు తమకు రైస్‌మిల్లర్ల వద్ద సమస్యల్లేకుండా చూడాలని ఎంపీడీఓకు విజ్ఞప్తి చేశారు. ఏఓ లక్ష్మి, ఎంపీటీసీ సభ్యుడు రాజేంద్ర, సొసైటీ సీఈఓ వంశీ, వీఏఏ మహేష్, పంచాయతీ కార్యదర్శి మాల్యాద్రి, కేతు వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.

➡ బుచ్చిరెడ్డిపాళెం: ధాన్యం కొనుగోలు కేంద్రాలపై రైతులకు అవగాహన సదస్సును స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి సురేంద్రరెడ్డి, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

➡ పొదలకూరు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలపై రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయ సహాయ సంచాలకులు కె.శివనాయక్ మాట్లాడుతూ మండలంలో పొదలకూరు, మరుపూరు, వావింటపర్తి, తాటిపర్తి – 1, తాటిపర్తి – 2, నావూరు, మహ్మదాపురం, బిరదవోలు, సూరాయపాళెం, బత్తులపల్లి, దుగ్గుంట, నేదురుమల్లి, విరువూరు గ్రామాల్లో కేంద్రాలు ఉంటాయన్నారు. అయితే పక్క గ్రామాల్లోనే కేంద్రాలుంటే రెండు, మూడింటిని కలిపి ఒక కేంద్రంలో ట్రక్ షీట్‌ను అందజేయడం జరుగుతుందన్నారు. ఇన్‌చార్జి తహసీల్దార్ సురేఖ, ఎంపీడీఓ ఎం.సాయిప్రసాద్ మాట్లాడుతూ రైతులకు ఇబ్బందులు తలెత్తితే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఏఓ ఎ.వాసు నిబంధనలు వివరించారు.

➡ మనుబోలు: మండలంలోని వెంకన్నపాళెం గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మండల వ్యవసాయాధికారి షేక్ జహీర్ శుక్రవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రైతులు దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. అధికారులు కట్టువపల్లి, మడమనూరు గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీటీ బషీర్, వీఆర్వో నాగార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: పరిశీలిస్తున్న తహసీల్దార్

➡ ముత్తుకూరు: ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలపై అపోహలు పెట్టుకోవద్దని ఎంపీడీఓ నాగమణి, వ్యవసాయాధికారిణి జ్యోత్స్న రాణి విజ్ఞప్తి చేశారు. మండలంలోని వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన తొమ్మిది ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో శుక్రవారం అధికారులు రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బ్రహ్మదేవి, ముత్తుకూరు గ్రామసభల్లో వారు మాట్లాడారు. స్థానిక నాయకులు పాల్గొన్నారు.



ముత్తుకూరు: మాట్లాడుతున్న వ్యవసాయాధికారిణి



మనుబోలు: మాట్లాడుతున్న ఏఓ జహీర్



కొడవలూరు: మాట్లాడుతున్న స్ఫూర్తి

భక్తులకు మజ్జిగ పంపిణీ

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: జొన్నవాడలోని మల్లికార్జున సమేత కామాక్షితాయి ఆలయంలో భక్తులకు మజ్జిగను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఈఓ శ్రీనివాసులు రెడ్డి మాట్లాడారు. వేసవి ముగిసేంత వరకు మజ్జిగను నిత్యం అందజేయనున్నామని వివరించారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

ఇందుకూరుపేట: విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో మండలంలోని అన్ని గ్రామాల్లో సరఫరా శనివారం ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఉండదని ఏడీ సురేంద్రబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

విద్యార్థినులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న వైద్యుల బృందం

తోటపల్లిగూడూరు: మహిళా దినోత్సవం సందర్భంగా ఇండియన్ డెంటల్ అసోసియేషన్ నెల్లూరు బ్రాంచ్, ఉమెన్స్ డెంటల్ కౌన్సిల్ ఆధ్వర్యంలో శుక్రవారం చిన్నచెరుకూరు ప్రభుత్వ బాలికల వసతి గృహంలో విద్యార్థులకు అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆ అసోసియేషన్ నెల్లూరు బ్రాంచ్ మాజీ అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ పళ్ల శుభ్రత విషయంలో విద్యార్థినులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే పంటి సంబంధిత వ్యాధులతో ఇబ్బందులు పడే అవకాశం ఉందన్నారు. ఎస్ఎస్ఆర్ ట్రస్ట్ తరఫున పరీక్షల అట్టలు, వైయూ ట్రస్ట్ తరఫున పెన్నులను అందజేశారు. అలాగే ఓరల్, జనరల్ హైజీనిక్ కిట్, బ్రష్‌లు తదితరాలిచ్చారు. కార్యక్రమంలో అసోసియేషన్ నెల్లూరు బ్రాంచ్ జనరల్ సెక్రటరీ డాక్టర్ రాజశేఖర్, ట్రెజరర్ డాక్టర్ నిరంజన్, వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ దీప్తి, ఉమెన్స్ డెంటల్ కౌన్సిల్ నెల్లూరు బ్రాంచ్ చైర్మన్ డాక్టర్ అమరజ్యోతి, దంత వైద్యులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో మహిళల ముందంజ

బుచ్చిరెడ్డిపాళెం: పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో మహిళలు ముందంజలో ఉన్నారని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని బుచ్చిరెడ్డిపాళెంలో శుక్రవారం నిర్వహించిన సభకు ముఖ్యఅతిథిగా ఆమె హాజరయ్యారు. వివిధ రంగాల్లో ప్రతిభ కనబర్చిన మహిళలను సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ చైర్‌పర్సన్ సుప్రజ, న్యాయవాది జక్కా శేషమ్మ తదితరులు పాల్గొన్నారు.

